క్లుప్తంగా

'మున్సిపాలిటీలో విలీనం చేయొద్దు'

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల గ్రామాన్ని వనపర్తి మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని కోరుతూ మంగళవారం గ్రామ నాయకుడు రఘుపతిరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు వనపర్తిలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి గ్రామంలో గ్రామసభ నిర్వహించి ప్రజల అభిప్రాయం మేరకే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల శివారులోని మహాత్మా జోతిబాపూలే గురుకుల పాఠశాల వార్షికోత్సవం మంగళవారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఏఎంఓ మహనంది, కో ఆర్డినేటర్ యుగంధర్, ప్రిన్స్‌పాల్ గురువయ్యగౌడ్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు దామోదర్‌రెడ్డి, శ్రీనివాసులు, వ్యవసాయ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, ఉపాధ్యాయులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఎన్నిక ఏదైనా గెలుపు బీజేపీదే..



సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రంలో ఎన్నిక ఏదైనా గెలుపు బీజేపీదేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో అధికార పార్టీకి దీటుగా సీట్లు సాధించామన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం శాసనమండలి సభ్యుడిగా బీజేపీ మద్దతుతో పోటీ చేసిన మల్క కొమరయ్య గెలుపొందడంతో మంగళవారం జిల్లా వ్యాప్తంగా నాయకులు సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బి.శ్రీశైలం, చిత్తారి ప్రభాకర్, వెంకటేశ్వరరెడ్డి, బచ్చు రాము, కుమార్, తిరుమలేష్, ఆశన్న, రవినాయక్, గోపి ముదిరాజ్, శివశంకర్, సత్యనారాయణ, గోపాల్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సాగునీటి సమస్యను పట్టించుకోని ప్రభుత్వం



మదనాపురం: కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి సమస్యను పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ ఆరోపించారు. మంగళవారం ఆయన పార్టీ కార్యకర్తలతో కలిసి మండలంలోని తిర్మలాయపల్లి, అజ్జకొల్లులో పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులను చిన్నచూపు చూస్తోందని, సాగునీరు అందించడంలో విఫలమైందన్నారు. పంటలకు నీరందక వందల ఎకరాలు ఎండిపోతుంటే తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి నీరు వదిలి ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట నాయకులు వెంకట్రాములు, జీఎస్ గోపి, చెన్నయ్య ఉన్నారు.

రేపటి ధర్నాను విజయవంతం చేయండి

వనపర్తి రూరల్: కలెక్టరేట్ ఎదుట గురువారం నిర్వహించే ధర్నాకు కార్మికులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, కనీస వేతన జీఓను సవరించాలని డిమాండ్ చేశారు.

గెంటీల రాంబాబుకు డాక్టరేట్

పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన గెంటీల బిచ్చన్న, ఈశ్వరమ్మ కుమారుడైన గెంటీల రాంబాబు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. రాష్ట్రంలో యాంత్రీకరణ ప్రభావం- కాస్ట్ ఆఫ్ అగ్రికల్చర్ క్రాప్స్ అనే అంశంపై కామర్స్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్ కృష్ణచైతన్య పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్‌ను అందుకున్నాడు.

పుర బడ్జెట్ రూ. 46.51కోట్లు

వనపర్తి టౌన్: స్థానిక మున్సిపాలిటీలో ఆదాయ, వ్యయాలకు సంబంధించిన సాధారణ బడ్జెట్‌ను అధికారులు మంగళవారం ప్రవేశపెట్టారు. మురికివాడలు, వెనుకబడిన ప్రాంతాలు, విలీన ప్రాంతాలకు అదనపు నిధులతో పాటుగా ఏడాది కాలంలో 33వార్డుల్లో ఒక్కొక్క వార్డు అభివృద్ధికి రూ. 60లక్షల చొప్పున నిధులను ఖర్చు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పుర కార్యాలయంలో జరిగిన బడ్జెట్ అంచనాలకు మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్, కలెక్టర్ ఆదర్శ్ సురభి 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.4,651.14 లక్షల బడ్జెట్ అంచనాలను మున్సిపాలిటీ చట్టం 2019 సెక్షన్ 107, 108 ప్రకారం ఆమోదం తెలిపారు. జమ ఖర్చులు, లెక్కల పత్రాలను కలెక్టర్ సూచనలకు అనుగుణంగా బడ్జెట్‌కు రూపకల్పన చేశారు. గతేడాది మొత్తం బడ్జెట్‌లో 2025–26 నాటి ప్రారంభ నిల్వ రూ. 409.73 లక్షలు చూయించగా.. 2026 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి మిగులు బడ్జెట్ రూ. 139.77లక్షల అంచనా వేశారు. పన్ను ఆదాయం రూ.1,753.11లక్షలు, పన్నేతర ఆదాయం రూ.1,293.68లక్షలుగా చూపారు. డిపాజిట్‌లు, అడ్వాన్స్‌ల ద్వారా రూ. 12లక్షలు, గ్రాంట్స్ ద్వార రూ.1,183.62లక్షలు అంచనా వేయగా.. మొత్తంగా ఆదాయం రూ. 4651.14 లక్షలుగా బడ్జెట్‌ను ప్రతిపాదించారు. బడ్జెట్‌లో తప్పనిసరిగా చెల్లించాల్సిన జీతాలు, వేతనాలకు రూ.580లక్షలు, శానిటేషన్‌కు రూ.244.27 లక్షలు, పురపాలికలో పచ్చదనం పెంచేందుకు గ్రీన్ బడ్జెట్‌కు రూ.304.67 లక్షలు ప్రతిపాదించారు. పవర్ చార్జీలకు రూ. 283 లక్షలు, రుణాల చెల్లింపులకు రూ. 25 లక్షలు, నిర్వహణ ఖర్చులకు రూ. 283 లక్షలు పోను మిగిలిన బడ్జెట్‌లో మూడో వంతు బడ్జెట్ రూ.442.01లక్షలను అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలు, బడుగులు నివాసం ఉండే కాలనీలు, మైనార్టీ, మురికివాడల ప్రాంతాల్లో మౌళిక వసతుల కల్పనకు కేటాయించనున్నట్లు వెల్లడించారు. వార్డుల వారీగా అభివృద్ధి కోసం రూ.1,054 లక్షల చొప్పున ప్రతిపాదించారు. ఇతర గ్రాంట్లు, డిపాజిట్లు, కార్యాలయ నిర్వాహణ ఖర్చులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. వీధి కుక్కల నియంత్రణకు ఈ సారి బడ్జెట్‌లో రూ. 15లక్షలు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.



పుర బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, పుర అధికారులు

ఆదాయంతోనే అభివృద్ధి

పురపాలికలో నిధులు సమకూర్చుకుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ఆస్తి పన్ను వందశాతం వసూలు చేయాలని ఆదేశించారు. కుళాయి, ఎల్ఆర్ఎస్‌పై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ యాదయ్య, పుర కమిషనర్ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

2025-26 బడ్జెట్ అంచనా వివరాలు	ప్రస్తుత ప్రారంభ నిల్వ	మొత్తం బడ్జెట్ ఖర్చులు	2026 మార్చి నాటికి మిగులు నిధులు	పన్ను ఆదాయం	పన్నేతర ఆదాయం:
	రూ. 409.73 లక్షలు	రూ. 4511.37 లక్షలు	రూ. 139.77 లక్షలు	రూ. 1,753.11 లక్షలు	రూ. 1,293.68 లక్షలు

'పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదు'

సాక్షి ఎఫెక్ట్..

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిలిచిన మురుగు నీరు అనే శీర్షికన సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితం అయిన కథనానికి స్పందించి జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలోని మురుగు నీరు నిలిచిన ప్రాంతాన్ని పరిశీలించి, సమస్యకు గల కారణాలను ఉపాధ్యాయ బృందం, ఎంపీఓను అడిగి తెలుసుకున్నారు. మురుగు నీరు సక్రమంగా బయటకు వెళ్లే విధంగా పారిశుద్ధ్యం కార్మికులు డ్రెయినేజీలో పేరుకపోయిన మట్టిని తొలగించారు. దీంతో నీరు నిల్వ లేకుండా సాఫీగా వెళ్తుందని వారు డీపీఓ దృష్టికి తీసుకొచ్చారు. పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న సామూహిక ఇంకుడుగుంత, మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. పారిశుద్ధ్య నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని పంచాయతీ అధికారులకు, సిబ్బందికి హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీఓ రఘురాములు, హెచ్ఎం విజయ్, పంచాయతీ కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.



బాలుర ఉన్నత పాఠశాలలో మురుగు నిలిచిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీపీఓ సురేష్‌కుమార్

విద్యార్థి కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

గోపాల్‌పేట: ఫిబ్రవరి 26 శివరాత్రి రోజు కల్వకుర్తి మండలంలోని జయప్రకాశ్‌నగర్‌తండా ఎస్సీ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఓమేష్ (16) ప్రమాదవశాత్తు ఓ కోనేరులో మునిగి మరణించిన విషయం తెలిసిందే. వారి సొంత గ్రామం మున్ననూరులో మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మేఘారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. నలుగురు సంతానంలో మూడోవాడైన ఓమేష్ చదువులో హుషారుగా ఉండేవాడని, శివరాత్రిరోజు వెల్దండ మండలంలోని అంబాలింగేశ్వర స్వామి జాతరకు వెళ్లి కోనేరులో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు మునిగిపోయి మరణించాడని విద్యార్థి తల్లిదండ్రులు రాములు, లక్ష్మి తెలిపారు. ప్రభుత్వపరంగా అందాల్సిన సాయాన్ని అందేలా చూస్తామని, తక్షణ ఆర్థికసాయంగా రూ.పది వేలు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఆయన వెంట సత్యశీలా రెడ్డి, గ్రామస్తులు సత్యం, దీరుమల్లు, రాజు, రాములు తదితరులు ఉన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ సత్యానారాయణరెడ్డి



వీపనగండ్లలో..

పాన్‌గల్: బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ సత్యానారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిరోధంపై అవగాహన కల్పించే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తూ బాల్యవివాహాలను ముందస్తుగా గుర్తించినట్లయితే వాటిని అరికట్టవచ్చని సూచించారు. దీంతో పాటు ఆడ పిల్లలను బాగా చదివించాలని, చదువుకుంటే కలిగే లాభాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి గ్రామాల్లో వివరించాలన్నారు. ఎలాంటి సమాచారం ఉన్నా హెల్ప్ లైన్ 1098 కు సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో డీటీ అశోక్‌నాయుడు, బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ లక్ష్మమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

వీపనగండ్ల: బాలల హక్కులను పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తహసీల్దార్ వరలక్ష్మి అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మహిళా అభివృద్ధి శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బాల్యవివాహాలను అరికట్టాలని, బాలబాలికలకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన 1098, 112, 100 టోల్‌ఫ్రీ నెంబర్లకు సమాచారం అందివ్వాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ కృష్ణమూర్తి, డీపీపీయూ సిబ్బంది, సోషల్‌వర్కర్ నరేందర్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'క్షయ పరీక్షల లక్ష్యం పూర్తి చేయాలి'



వీపనగండ్ల: కలెక్టర్ ఆదేశానుసారం వంద రోజుల్లో మండలంలోని గ్రామాల్లో క్షయ వ్యాధిపై సర్వే నిర్వహించి లక్ష్యం చేరుకునేందుకు వైద్య సిబ్బంది సహకరించాలని మండల వైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు వైద్య సిబ్బందితో ప్రత్యేక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్లు హేమవర్ధన్, శ్వేత, కరుణశ్రీ, కళమ్మ, విజయకుమారి, వైద్య సిబ్బంది ఉన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు



ఆత్మకూర్: ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ప్రిన్సిపాల్ భాగ్యవర్ధన్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్విజిలేటర్లతో సమావేశమయ్యారు. మొత్తం 40 మంది విధులు నిర్వహించనున్నారని ఈమేరకు పరీక్ష కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలను సమకూర్చినట్లు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించి 373 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, అలాగే వికాస్ కళాశాలలోని సెంటర్‌లో 167 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం పరీక్షలు రాయనున్నారని వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు జిరాక్స్ కేంద్రాలన్నీ మూసివేయించనున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

అమరచింత: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం చేస్తామని ఆ పార్టీ మండల కార్యదర్శి జీఎస్ గోపి, నాయకులు వెంకటేష్, అజయ్ అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు గ్రామ సమస్యలపై పార్టీ పరంగా సర్వే చేపడుతున్నామన్నారు. మార్చి చివరి నాటికి సమస్యలపై సర్వే నిర్వహిస్తామని తెలిపారు. మండలంలోని కొంకన్‌వానిపల్లి గ్రామంలో మంగళవారం కాలనీల్లో తిరుగుతూ సమస్యలను గుర్తించామన్నారు. గ్రామంలో అద్దె భవనంలో అంగన్‌వాడీ కొనసాగుతుందని పేర్కొన్నారు. సీసీ రహదారుల సమస్య వేధిస్తున్నా అధికారులు గత పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు రహదారులపై పారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలకు సాగునీరు లేక పంటలు పండించుకోలేక తమ వ్యవసాయ భూములు బీడుగా వదిలేస్తున్నారని, ఎత్తిపోతల పథకం చేపట్టి సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాలు ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆసరా పెన్షన్‌ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు సమీపంలోని అమరచింతకు వెళ్లాల్సిన పరిస్థితి కల్పించడం ఏమిటన్నారు. గ్రామ సమస్యలను పరిష్కరించాలంటూ ఈనెల 9న పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహేష్, మొగిలి, అంజిరెడ్డి, మోహన్, నాగరాజు, శివ, హరీశ్ పాల్గొన్నారు.



కొంకన్‌వానిపల్లిలో మురుగు చూపుతున్న సీపీఎం నాయకులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆత్మకూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ఆయాలకు సంబంధించిన పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు నాగరాజు, బొబ్బిలి నిక్సన్ మాట్లాడుతూ ఆత్మకూర్ ప్రాజెక్టు పరిధిలోని కొత్తకోట, ఆత్మకూర్, అమరచింత, మదనాపురం మండలాలకు సంబంధించి 2021 నుంచి ఆయాలకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే మినీ అంగన్‌వాడీ సెంటర్ల టీచర్లు, ఆయాలకు సంబంధించిన పది నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వాపోయారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీఓకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అరుణ, గాయత్రి, రామేశ్వరి, ప్రేమలత, సైదాబీ, హుస్సేన్‌బీ, జయమ్మ, అనిత, కవిత, మధురిమ, ఇందిరమ్మ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల ముందస్తు అరెస్టు

పాన్‌గల్: అంగన్‌వాడీ కార్యకర్తల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాకు వెళ్లకుండా మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సంఘం నాయకురాలు మాట్లాడుతూ మినీ నుంచి ప్రధాన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు పెండింగ్‌లో ఉన్న 9 నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధర్నాతో పాటు ఐసీడీఎస్ డైరెక్టర్, ఐసీడీఎస్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ వినతిపత్రాలు ఇచ్చేందుకు హైదరాబాద్‌కు వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసినట్లు వారు పేర్కొన్నారు.



పాన్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో అంగన్‌వాడీ సంఘం నాయకులు, టీచర్లు

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులకు మేలు



సైన్స్ ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మదనాపురం: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులకు మేలు జరుగుతుందని, వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయొచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్‌ఘనీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోఎజిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించగా.. జిల్లాలోని 33 పాఠశాల విద్యార్థులు పాల్గొని వివిధ ప్రయోగాలు ప్రదర్శించారు. ఉపాధ్యాయులు తయారు చేసిన బోధన అభ్యాసన పరికరాలు, కళాకృతుల ప్రదర్శన నిర్వహించారు. పోటీల్లో పెబ్బేరు మోడల్ స్కూల్ విద్యార్థులు మొదటి బహుమతి సాధించగా.. ద్వితీయ బహుమతి జెడ్పీహెచ్ఎస్ మదనాపురం, తృతీయ బహుమతి బాలుర జెడ్పీహెచ్ఎస్ పెబ్బేరు విద్యార్థులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఫారూక్‌హుస్సేన్, హెచ్ఎం మద్దిలేటి, ఎన్జీసీ జిల్లా అధికారి సుదర్శన్‌రావు, సైన్స్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎన్జీసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బిందు సేద్యంతో నీటిఎద్దడిని నివారించవచ్చు

వీపనగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని ఉపయోగించుకొని ఉద్యాన పంటల్లో బిందు సేద్యపు పరికరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల నీటి ఎద్దడిని నివారించొచ్చని మండల ఉద్యాన శాఖ అధికారి కృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బిందుసేద్యం పరికరాల పనితీరుపై ఆయన రైతులకు పలు సూచనలు ఇచ్చారు. పండ్ల తోటలకు అవసరమైన ఫర్టిలైజర్‌ను కూడా బిందు సేద్యం పరికరాల ద్వారా అందించవచ్చన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీపై అవసరమైన సమాచారం కోసం ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ రవి, పలువురు రైతులు పాల్గొన్నారు.



బిందు సేద్యంపై వివరిస్తున్న ఉద్యాన శాఖ అధికారి కృష్ణ

అమరచింత మున్సిపాలిటీకి రూ.52లక్షలు మంజూరు

అమరచింత: మున్సిపాలిటీలో సీసీ రహదారుల నిర్మాణం కోసం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్, కమిషనర్ టీకే శ్రీదేవి రూ.52 లక్షలు మంజూరు చేశారు. ఫిబ్రవరిలో పట్టణాన్ని సందర్శించిన ఆమె మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డితో కలిసి పట్టణంలో బైపాస్ రహదారి కోసం ప్రతిపాదనలు చేసి.. ఈ మేరకు నిధులు కేటాయించారు. మున్సిపాలిటీలో నిధులు లేక అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయని, సీసీ రహదారుల నిర్మాణం అసంపూర్తిగా ఉన్నాయని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మంగమ్మ, మున్సిపల్ కమిషనర్ రవిబాబు టీకే శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. అడిగిన వెంటనే రూ.52 లక్షలు మంజూరు చేసిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కొత్తతండా రహదారి నుంచి మున్సిపల్ కార్యాలయ సమీపం నుంచి మరికల్ ప్రధాన రహదారి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు నిదులు మంజూరు అయ్యాయని వెల్లడించారు.

అభివృద్ధికి దూరంగా 7వ వార్డు

మున్సిపల్ పరిదిలోని 7వ వార్డులో నేటి వరకు ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో వార్డు ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అన్ని వార్డులతో పాటు తమ వార్డు ప్రజలు సైతం ఇంటి పన్నులు కడుతున్నా కేవలం బీజేపీకి చెందిన కౌన్సిలర్ గెలుపొందాడని వార్డులో అభివృద్ధి పనులను నిలిపివేయడం ఏమిటని కాలనీవాసులు ప్రశ్నించినా పట్టించుకునే వారే కరువయ్యారు.

'ఇంటింటి సర్వేలో సమస్యలు గుర్తించాం'

వీపనగండ్ల: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర రిపోర్టులు తయారు చేస్తున్నామని సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం గోపల్‌దిన్నెలో ఇంటింటి సర్వే నిర్వహించగా.. గ్రామాల్లో డ్రెయినేజీ సమస్యలతో పాటు పలు కాలనీలకు కనీస వసతులు, సమస్యలు నెలకొన్నాయని గ్రామానికి ఒకే ఆర్టీసీ బస్సు రావడంపై గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. గ్రామంలో 40 శాతం రైతులకే రుణమాఫీ జరిగిందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, ప్రతి మహిళకు రూ.2,500 పథకం గ్రామంలో అమలు కాలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, వెంకటయ్య, రాముడు, కృష్ణయ్య, రంగస్వామిగౌడ్ ఉన్నారు.

బాధితురాలికి బంగారం అప్పగింత



బాధితురాలికి బంగారు నానును అప్పగిస్తున్న కానిస్టేబుల్ శివకుమార్

జాతరలో బంగారు నాను పోగొట్టుకున్న మమత

గోపాల్‌పేట: జాతరలో ఓ మహిళ రూ.1.64లక్షల విలువ చేసే రెండు తులాల బంగారు నాను పోగొట్టుకోగా పోలీసులు గుర్తించి బాధితురాలికి తిరిగి అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. రేవల్లి మండలంలోని శానాయిపల్లి గట్టుపై మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా జాతర నిర్వహించారు. జాతర బందోబస్తులో ఉన్న కానిస్టేబుల్ శివకుమార్‌కు ఫిబ్రవరి 28న రెండు తులాల బంగారు నాను దొరికగా.. ఎస్ఐ రాముకు అప్పగించారు. బంగారు నాను పోగొట్టుకున్న గూపని మమత శానాయిపల్లికి చెందిన లింగస్వామికి విషయం తెలిపగా.. అతడు పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. ఆ తర్వాత రేవల్లి ఎస్ఐ బాధితురాలు గూపని మమతను పిలిపించి అన్ని వివరాలు తెలుసుకున్నాడు. రెండు తులాల నానుకు సంబంధించిన వివరాలను బాధితురాలు ఎస్ఐకి చూపించడంతో ఎస్సై మమతకు చెందిన బంగారమేనని గుర్తించి మంగళవారం అప్పగించారు. ఈ మేరకు మమత కానిస్టేబుల్ శివకుమార్, ఎస్ఐకి కృతజ్ఞతలు తెలిపారు. కానిస్టేబుల్ శివకుమార్‌ను శాలువాతో సన్మానించారు.

కొనసాగుతున్న సీపీఐ నిరసన

ఆత్మకూర్: మున్సిపాలిటీ కేంద్రంలో ప్రభుత్వ స్థలాల్లో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలు తొలగించాలంటూ చేపట్టిన నిరవధిక నిరసన మంగళవారం ఆరో రోజు కొనసాగింది. అక్రమ కట్టడాలను కూల్చేంత వరకు పోరాటాన్ని ఉధృతంగా చేపడుతామని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. పట్టణంలోని బాబా కాలనీలో టీఎన్జీఓ భవనం పక్కన ఉన్న 20 ఫీట్ల రోడ్డును కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మాజీ ఎంపీపీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వెంచర్లలో అన్యాక్రాంతమైన 10 శాతం ప్లాట్లను తిరిగి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో శ్రీహరి, మోష, సీఎస్‌శెట్టి, అబ్రహం, భాస్కర్, కుతుబ్, రవీందర్, శేఖర్, శ్యాంసుందర్, లక్ష్మీనారాయణశెట్టి, కుమార్, బాలస్వామి, రాంచందర్, గీత, కృష్ణవేణి, పద్మ, మాసమ్మ, పార్వతమ్మ తదితరులు పాల్గోన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

సీసీ రోడ్లకు నిధులు మంజూరు

చిన్నంబావి: కొల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేశారు. పాన్‌గల్ మండలానికి రూ.1.28కోట్లు, చిన్నంబావి మండలానికి రూ.65లక్షలు, వీపనగండ్ల మండలానికి రూ.64.75లక్షల నిధులు సీసీ రోడ్లకు మంజూరు చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లికి ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.